

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి తుమ్మల

అభివృద్ధిలో దూసుకుపోతున్నాం..

- తెలంగాణను అందుకునే శక్తి దేశంలో ఏ రాష్ట్రానికీ లేదు
- రాష్ట్ర ఎదుగుదలను చూడలేక కొందరు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు
- వారికి అభివృద్ధితోనే సమాధానం చెబుతాం
- కాలువలు నిర్మించకపోతే 'సీతారామ'తో ఉపయోగం శూన్యం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- గోదావరి నదిపై నావిగేషన్ అధ్యయనం: మంత్రి తుమ్మల
- కొత్తగూడెం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

కొత్తగూడెం, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అభివృద్ధిని అందుకునే శక్తి ఈ దేశంలో ఏ రాష్ట్రానికి లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం కొత్తగూడెం నియోజకవర్గంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్లు, పాల్వంచలోని హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణాలకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో భట్టి ప్రసంగించారు.

పదేళ్లు ఫాంహౌస్‌లో పడుకుని ప్రజల సొమ్ము దుబారా చేసి ప్రస్తుతం రాష్ట్ర ఎదుగుదల చూడలేక అడ్డగోలుగా మాట్లాడేవారికి అభివృద్ధితోనే సమాధానం చెప్తామన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా అడవి నష్టపోకుండా ఇందిర సౌర, గిరి జల వికాసాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పథకం కోసం రూ.12,500కోట్లు ఖర్చు పెట్టబోతున్నట్లు తెలిపారు. వచ్చే సోమవారం నాగూర్ కర్నూల్ జిల్లాలోని అచ్చంపేటలో ఇందిరి గిరి జిల్లా వికాస పథకాన్ని సీఎం ప్రారంభించనున్నారని అన్నారు. 2023-24లో రాష్ట్రంలో 15వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉండగా గత పాలకులు అదికూడా సక్రమంగా చేయలేకపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఈ మార్చిలో 17,162మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చినప్పటికీ చిన్న అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేశామన్నారు. సీతారామ ప్రాజెక్టును ప్రాధాన్య ప్రాజెక్టుగా ముందుకు తీసుకుపోతున్నామని తెలిపారు. ప్రాజెక్టు కాల్వలకు కావాల్సిన భూసేకరణ చేపట్టాలని, అందుకు అవసరమైన నిధులను విడుదల చేస్తామన్నారు. ప్రాజెక్టును నిర్మించి సాగునీటి కాల్వలు నిర్మించకపోవడంతో ఉపయోగం ఉండదని, బ్యారేజీలు, రిజర్వాయర్లు కట్టి వదిలేస్తే సముద్రంలో నీరు ఉన్నట్లే కానీ ఉపయోగం ఉండదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి పనుల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు ఢిల్లీలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు భట్టి తెలిపారు. రాష్ట్రంలోని అనేక జిల్లాలను కలుపుతూ రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని, రీజనల్ రింగ్ రోడ్డుకు ఔటర్‌రింగ్‌రోడ్డుకు మధ్య ఫార్మా, అగ్రకల్చర్, హౌసింగ్‌వంటి పలు రకాల క్లస్టర్లను నిర్మించబోతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల పిల్లలకు ఉచితంగా ప్రపంచస్థాయి విద్యను అందించేందుకు యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు.




అభివృద్ధి పనులకు శ్రీకారం

కొత్తగూడెం నియోజకవర్గానికి చెందిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటి సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి శ్రీకారం చుట్టారు. కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇందిరి మహిళా శక్తిక్యాంటిన్‌ను తనిఖీ చేశారు. అక్కడి మహిళలతో మాట్లాడి వ్యాపారం ఎలా ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్‌సబ్‌స్టేషన్ల ఉమ్మడి శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.18.17కోట్ల అంచనా వ్యయంతో కొత్తగూడెం కలెక్టరేట్ కార్యాలయం, పాల్వంచలోని పాండురంగాపురం, శ్రీనివాస్‌నగర్‌కాలనీలో నూతనంగా నిర్మించనున్న 33/11 కేవీల మూడు విద్యుత్ ఉపకేంద్రాలకు, కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న సూపరింటెండెంట్, డివిజనల్ ఇంజనీరు కార్యాలయం, జిల్లా స్టోర్ కార్యాలయం, విద్యుత్ నియంత్రికల మరమ్మతుల కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాల్వంచలోని సోములగూడెం, కిన్నెరసాని ప్రాంతంలోని రోడ్లు, బ్రిడ్జిలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఎన్‌పీడీసీఎల్ సీఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండి బలరాం, కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గోదావరిపై నావిగేషన్ అధ్యయనం

భద్రాద్రి జిల్లా సమగ్ర అభివృద్ధికి రోడ్లు, రైల్వే, ఎయిర్, జల, రవాణా వ్యవస్థలు అవసరమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భద్రాద్రి రామాలయం అభివృద్ధికి రామాలయం చుట్టు జాతీయ రహదారులను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగూడెం నుంచి కౌతులాపూర్, కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వయా ఇల్లెందు రహదారుల నిర్మాణం జరుగుతుందన్నారు. పోలవరం, సమ్మక్క సారక్క, అన్నారం, సుందేళ్ల, కాళేశ్వరం రిజర్వాయర్ పూర్తి అయ్యాయని అయా ప్రాంతాల్లో నావిగేషన్ అధ్యయనం చేపట్టి జల రవాణాకు ప్రణాళికలను చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కోరారు. ఎయిర్‌పోర్టు కోసం గతంలో సూచించిన స్థలంలో కొన్ని కారణాల వల్ల అనుమతులు లభించలేదని మళ్లీ అధ్యయనం చేపడతామన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమ పరిధిలో పంట కాల్వల నిర్మాణానికి భూమి సేకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. భవిష్యత్‌లో విద్యుత్‌కు లోటు లేకుండా ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి ఆరు ఉప కేంద్రాలను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకుని ఈ శంకుస్థాపనలు చేపట్టినట్లు మంత్రి తుమ్మల తెలిపారు.



పత్తి కాటాలో మోసానికి పాల్పడి అరెస్టయిన నిందితులను చూపుతున్న పోలీసులు

పత్తి తూకంలో మోసాలు

- వే బ్రిడ్జి రశీదుల్లో అసలు బరువు కంటే ఎక్కువ నమోదు
- 3 నెలలుగా కొనుగోలుదారులకు కుచ్చుటోపీ
- రూ. 16లక్షల మోసానికి పాల్పడినట్టు గుర్తింపు
- 26 మంది అరెస్ట్.. పరారీలో ఇద్దరు
- రూ. 13లక్షల రికవరీ... 18 ట్రాలీ ఆటోలు సీజ్

సుజాతనగర్, మే 17 (ఆంధ్రజ్యోతి): పత్తి తూకంలో అక్రమాలకు పాల్పడి కొనుగోలుదారులను మోసగించి లక్షలు దండుకున్న 26 మంది వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీస్ స్టేషన్‌లో శనివారం కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఈ సంఘటన పూర్వాపరాలు వెల్లడించారు. మండల పరిధిలోని మార్కెట్ యార్డ్‌లో జూలూరుపాడు మండలం పాలకొల్లు గ్రామానికి చెందిన కేశపూర్ణ వెంకట కృష్ణారావు, సుజాతనగర్ మండలం కోమటిపల్లి గ్రామానికి (మిగతా 6వ పేజీలో)




నకిలీ విత్తనాలపై నజర్

- వానాకాలం సీజన్‌పై వ్యవసాయశాఖ అప్రమత్తం
- ఉమ్మడి జిల్లాలో ప్రతి ఏటా రూ.200 నుంచి రూ.250కోట్ల వ్యాపారం
- నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు
- కలెక్టరేట్‌లో రేపు డీలర్లతో వ్యవసాయశాఖ అధికారుల సమావేశం
- ఉమ్మడి జిల్లాలో జిల్లాలో 6,31,124 ఎకరాల్లో పంటల సాగు

ఖమ్మం, మే 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నైరుతి రుతుపవనాలు ఈ సారి ముందుగానే వచ్చే అవకాశం ఉండడంతో రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. అడపాదడపా కురుస్తున్న అకాలవర్షాలతో ఒకవైపు దుక్కులు దున్నుతూ మరోవైపు పొలాలు శుభ్రం చేస్తున్నారు. సాగుకు సై అన్నట్లుగా రాబోయే వ్యవసాయ సీజన్‌కు అవసరమైన విత్తనాల కొనుగోలుకు కూడా సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అటు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్నతో పాటు పలురకాల పంటల సాగు జరుగుతున్నందున పత్తి, మిర్చి విత్తనాలకు డిమాండ్ అధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రతిఏటా సుమారు రూ.200 నుంచి రూ.250కోట్లపైగా విత్తనాలు వ్యాపారం సాగుతుంది. ప్రధానంగా పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న విత్తనాలకు డిమాండ్ ఉంది. దేశీ, విదేశీ రకాల విత్తనాలు రైతులు వినియోగిస్తున్నారు. దీంతో విత్తన డిమాండ్ ఉండడంతో కొన్ని నకిలీ కంపెనీలు కూడా జిల్లాలో దొడ్డిదారిన విత్తనాలు విక్రయిస్తున్నాయి వీటిని నివారించేందుకు ఈసారి వ్యవసాయశాఖ ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసింది. నకిలీపై నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

మండల, జిల్లాస్థాయిలో వ్యవసాయ రెవెన్యూ, పోలీస్ యంత్రాగాన్ని సమన్వయం చేస్తూ ఈ టీంలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇందుకోసం ముందుగానే నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు ఎలా ఉంటాయనేదానిపై డీలర్లతో వ్యవసాయశాఖ సమావేశాలు ఏర్పాటు చేయబోతుంది. సోమవారం కలెక్టరేట్‌లో డీలర్ల సమావేశం ఏర్పాటుతో పాటు టాస్క్‌ఫోర్సు కమిటీపై సమావేశాలు జరగబోతున్నాయి. జిల్లాలో వానాకాలం సీజన్‌కు ముందే వేసవిలోనే రైతులు ఆయా కంపెనీల నుంచి రైతులు విత్తనాలు బుకింగ్ చేయడం ఆనవాయితీ. మేలు రకం విత్తనాల కోసం కొందరు రైతులు ముందుగానే డబ్బులు అడ్వాన్స్ కట్టి తెప్పించడం కొన్నేళ్లుగా సాగుతోంది.

జిల్లాలో బ్రాండెడ్ విత్తనాలతో పాటు గుర్తింపులేని కంపెనీల విత్తనాలు కూడా గ్రామాల్లో తెరచాటున అమ్మకాలు సాగుతున్నాయి. అయితే గతంతో పోలిస్తే కేసులు తగ్గినప్పటికీ, ఇంకా గుర్తింపులేని విత్తనాలు ప్రతి ఏటా సీజన్‌లో నడుస్తున్నాయి. ప్రధానంగా మిర్చి, పత్తిలో ఈ విత్తనాల వ్యాపారం ఉంది. ఉమ్మడి ఖమ్మంజిల్లా ఏపీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు సరిహద్దున ఉంది. గుర్తింపులేని విత్తనాల కంపెనీలు అత్యధికం ఏపీలోని ప్రకాశం, గుంటూరు, కృష్ణాతో పాటు కర్నూలు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు సీజన్‌లో వస్తున్నాయి. అలాగే హైదరాబాద్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి నకిలీ విత్తనాల బెడద ఉంది. ఈనకిలీలను నివారించేందుకు ఇప్పటికే డీలర్ల వదద ఉన్న స్టాకులను వ్యవసాయశాఖ అధికారులు ముందుగానే శాంపిల్స్ సేకరిస్తున్నారు. మండలస్థాయి డీలర్లవద్ద, గ్రామాల్లోను నిఘా పెట్టేందుకు టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు సిద్ధమవుతున్నాయి.

తెలంగాణలో విత్తన వ్యాపారం అధికంగా జరిగే జిల్లాల్లో ఖమ్మం ఒకటి. ఇక్కడ అన్ని రకాల విత్తనాలకు డిమాండ్ ఉండడంతో ఇటు బ్రాండెడ్ కంపెనీలు తమ డీలర్లు, ఏజెంట్ల ద్వారా వ్యాపారం సాగిస్తుండగా కొంతమంది గుర్తింపులేని కంపెనీలకు సంబంధించిన వ్యాపారులు గ్రామస్థాయి లలో పెద్ద రైతులతో పాటు గతంలో బ్రాండెడ్ కంపెనీల్లో పనిచేసిన ఏజెంట్లు, సిబ్బందికి అధిక లాభాల ఆశచూపించి అప్పుగా ఇచ్చి విక్రయించే పద్ధతి జిల్లాలో ఉంది. గత రెండేళ్లుగా పోలీసు, వ్యవసాయశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు నిఘా పెంచడం, కేసులు పెట్టి అరెస్టులు చేయడంతో కొంత తగ్గుముఖం (మిగతా 6వ పేజీలో)

4లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు

ఉమ్మడిజిల్లాలో సుమారు 4లక్షల ఎకరాల పైగా పత్తి, లక్ష ఎకరాల వరకు మిర్చి లక్ష ఎకరాలలో మొక్కజొన్న రెండు సీజన్లు కలిపి సుమారు 4లక్షల ఎకరాలపైగా వరిసాగవుతుంది. ఈసాగుకోసం జిల్లా రైతులు ప్రతిఏటా రూ.200నుంచి 250కోట్లు విత్తనాలకే ఖర్చుచేస్తున్నారు. మిర్చికి ఎకరానికి రూ.8వేలపైగా ఖర్చవుతుండగా పత్తికి కూడా రూ.3వేలు, మొక్కజొన్నకు రూ.3వేలు, వరికి రూ.వెయ్యి చొప్పున రైతులు విత్తనాలకు ఖర్చుచేస్తున్నారు.

నల్లబంగారు లోకం..

- ఇల్లెందులో కొత్తగా జవహర్‌ఖని ఓపెన్‌కాస్ట్
- రొంపేడు, కూసపల్లిని కలుపుతూ ఏర్పాటు
- 15 నుంచి 20 ఏళ్ల పాటు బొగ్గు ఉత్పత్తి



ఓసీ ప్రతిపాదిత ప్రాంతం

ఇల్లెందు టౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇల్లెందు ఏరియాలో మరో నూతన ఓసీ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. సింగరేణి జవహర్‌ఖని ఓపెన్‌కాస్ట్ (రొంపేడు)ను ఏర్పాటుచేసేందుకు ఫేజ్-2 పర్యావరణ అనుమతులు లభించాయి. ఈ మేరకు శనివారం కేంద్ర పర్యావరణ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు సింగరేణి అధికారులు ప్రకటించారు. ఇల్లెందు ఏరియాలో ప్రస్తుతం నడుస్తున్న జేకే-5 ఓసీలో బొగ్గు నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఓసీ విస్తరణలో భాగంగా రొంపేడు, కూసపల్లి ప్రాంతాలను కలుపుతూ నూతన ఓసీ ఏర్పాటు కోసం సింగరేణి అధికారులు మూడు సంవత్సరాల క్రితం ప్రతిపాదనలు సిద్ధంచేశారు. పర్యావరణ అనుమతుల కోసం చేసిన ప్రయత్నాలు ఫలించడంతో జేకేఓసీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఈ ఓసీ సుమారు 15 నుంచి 20 (మిగతా 6వ పేజీలో)



ఇల్లెందులో నాయకులతో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్

కిన్నెరసానిలో 'ఆదివాసీ కాంగ్రెస్'

- ఈ నెల 29 నుంచి 31 వరకు శిక్షణ తరగతులు
- మీనాక్షి నటరాజన్, కొప్పుల రాజు, ముగ్గురు మంత్రుల రాక
- ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్

ఇల్లెందు, మే17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 29నుంచి 31 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని కిన్నెరసానిలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గిరిజన ఆర్థిక సహకార సంస్థ (ట్రైకార్) చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ తెలిపారు. దేశ వ్యాప్తంగా 25 వేల మంది సుశిక్షితులైన కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తలను తయారుచేసేందుకు ఏఐసీసీ, టీపీసీసీ (మిగతా 6వ పేజీలో)



లంబాడీలు గిరిజనులు కాదు...

- వారిని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి
- ఆదివాసీల ప్రయోజనాలను తన్నుకుపోతున్నారు..
- ఇతర రాష్ట్రాల్లో వారు అగ్రవర్ణాలుగా ఉన్నారు
- నేడు ఇల్లెందులో ఆదివాసీ గర్జన సభ, ర్యాలీ
- నిర్వాహక కమిటీ కన్వీనర్ జోగా రాంబ్రహ్మం

6

పథకాల అమలులో విఫలం



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని
- మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి
- ప్రధాన రహదారిపై టెంట్ వేసి మూడు గంటలు నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 17(ఆంధ్రజ్యోతి): ధనికులకు దోచిపెడుతూ... నిరుపేదల సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ప్రభుత్వాలు అప్పులు చూపుతున్నాయని, పథకాల అమలులో విఫలమయ్యాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు విమర్శించారు. శనివారం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. పధాన రహదారిపై మూడు గుడారం టెంట్లు వేసి మూడు గంటల పాటు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎర్రచీరలు ధరించిన మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్ల కార్డులను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో సుదర్శన్‌రావు మాట్లాడుతూ సీపీఎం మూడు దశాబ్దాల ఉద్యమాలను వివరించారు. ఖమ్మంలో పేదలకు ఎవ్వరైనా ఇళ్లు మంజూరు జరిగిందంటే అది సీపీఎం పోరాటాల ఫలితంగానే అన్నారు. అగ్రహారం కాలనీ, దన్వాయిగూడెం, ధంసలాపురం కాలనీ, శివాయిగూడెం గ్రామాలు సీపీఎం పోరాటాలు ఫలితంగా ప్రభుత్వాల మెడలు వంచి పేదలకు ఇళ్లు సాధించామన్నారు. 2007వ సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో సీపీఎం నిరాహార దీక్షలు చేయటంతో ఖమ్మంలో నిరుపేదలకు (మిగతా 6వ పేజీలో)

పల్లె పల్లెకూ 'భూ భారతి'

- జూన్ 2 నుంచి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు
- ప్రజలు తమ భూ సమస్యలపై అర్జీలు ఇచ్చుకోవచ్చు
- సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం

ఖమ్మం కలెక్టరేట్, మే 17 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేస్తున్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టు కింద నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారు. ఈ మండల పరిధిలోని 15 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 16వ తేదీ వరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. భూ విస్తీర్ణంలో తేడాలు, నిషేధిత జాబితాలోని భూములు ఉండటం, సాదాబైనామా, భూవిస్తీర్ణం, హద్దుల సమస్య, వారసత్వ హక్కు తదితర సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు స్వీకరించారు. మొత్తంగా ఇక్కడ 3224 దరఖాస్తులు అధికారులకు రెవెన్యూ సదస్సుల్లో అందాయి.

దరఖాస్తుల సంఖ్య ఇలా..

సాదాబైనామా 1,726, అసైన్డ్ భూములకు సంబంధించి 94, కొత్త పానుపుస్తకాల కోసం 287, సర్వేనెంబర్ సవరణ 126, విస్తీర్ణం వసరణ 281, భూమి రకం 9, భూమి స్వభావం 3, పట్టాదారుని పేరు సవరణ 27, తండ్రి, భర్త పేరు సవరణ 16, సాగులో ఉన్నా భూమి కన్నా పాసుపుస్తకంలో తక్కువగా నమోదు అయ్యింది 318, నిషేధిత జాబితాలో 47. ఓఆర్సీ రానివి 87, సర్వే సబ్‌డివిజన్ సమస్యలు 64, భూసేకరణ సమస్యలు 14, ఇతరములు 125.

అర్జీల స్వీకరణ.. క్షేత్రస్థాయి పరిశీలన

తొలుత ఎంపిక చేసిన మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి వివిధ సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు. నేరుగా దరఖాస్తులు స్వీకరించి వారికి రసీదులు అందజేశారు. ఆ వివరాలను భూ భారతి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 14 వరకు స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూగ్రామాల వారీగా మూడు బృందాలను నియమించారు. దరఖాస్తుదారులకు నోటీసులు అందజేసి వారి సమక్షంలోనే సర్వేయర్, రెవెన్యూ బృందాలు భూములను పరిశీలిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల్లో రైతుల వివరాలు తప్పుగా నమోదైతే వాటిని గుర్తించి, వెంటనే సరిచేస్తారు. ఈ భూ (మిగతా 6వ పేజీలో)

పత్తి తూకంలో మోసాలు

(5వ పేజీ తరువాయి)

చెందిన మూడు భీమ్లా ఐదు సంవత్సరాలుగా పత్తి వ్యాపారం చేస్తున్నారు. వీరు రైతుల వద్ద, చిరు వ్యాపారుల వద్ద పత్తి కొనుగోలు చేస్తుంటారు. విక్రయదారులు తమ పత్తిని యార్డులోని వేబ్రిడ్జి వద్ద తూకం వేయించి అందుకు సంబంధించిన రశీదును వ్యాపారులకు చూపిస్తారు. అందులో ఉన్న పరిమాణం మేరకు వ్యాపారులు డబ్బులు చెల్లిస్తారు. అయితే గత 3 నెలలుగా వ్యాపారంలో నష్టాలు వస్తుండటంతో వారికి ఏమీ అర్థం కాలేదు. తాము చెల్లిస్తున్న డబ్బుకు, తమకు చేరుతున్న పత్తికొ పొంతన ఉండటం లేదు. దీంతో వారికి వేబ్రిడ్జి నిర్వాహకులపై అనుమానాలు కలిగాయి.

కొంతమంది చిరు వ్యాపారులు మార్కెట్‌లో గుమస్తా అయిన భూక్యా అర్జున్, మార్కెట్‌యార్డులోని ప్రైవేటు వే బ్రిడ్జి ఆపరేటర్లు గోతం సతీష్, అక్కినపల్లి రాజేష్‌తో చేతులు కలిపి, పత్తి అసలు బరువు కంటే ఎక్కువగా వున్నట్టు వే బ్రిడ్జి బిల్ రశీదు తీసుకుని పత్తి విక్రయిస్తున్నారు. అలా రావాల్సిన డబ్బుల కంటే ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. ఈ మోసాన్ని కాస్త ఆలస్యంగానైనా కొనుగోలుదారులు గుర్తించి ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఎం.రమాదేవి కేసు నమోదు చేసి సీఐ రాయల వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు.

పోలీసుల విచారణలో ప్రైవేటు వే బ్రిడ్జి ఆపరేటర్లతో చిరువ్యాపారులు కుమ్మక్కైనట్టు తేలింది. ట్రాలీలో పత్తిని తీసుకువచ్చి తూకం వేసేటపుడు ట్రాలీ నుంచి డ్రైవర్ కిందకు దిగకపోవడంతో పాటు, మరో వ్యక్తిని ట్రాలీలోకి ఎక్కించి తూకం వేస్తున్నట్టు గుర్తించారు. ఇలా ప్రతీ ట్రాలీకి క్వింటాలుపైన ఎక్కువ బరువు చూపుతున్నారు. వాస్తవ బరువు కంటే ఎక్కువ బరువుతో రశీదులు రాయించుకొని, కొనుగోలుదారుల నుంచి ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారు. ఇలా 268.95 క్వింటాళ్లను అదనంగా చూపించి రూ. 16 లక్షల 58 వేలు అక్రమంగా పొందినట్టు గుర్తించారు.

ఈ కేసులో 26 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వారి నుంచి రూ.13 లక్షల 18వేలు రికవరీ చేశామని డీఎస్పీ తెలిపారు. 18 ట్రాలీ ఆటోలు సీజ్ చేశామని, మరో ఇద్దరు నిందితులు (వే బ్రిడ్జి ఆపరేటర్లు) పరారీలో ఉన్నట్లు తెలిపారు. అరెస్టయిన 26 మంది నిందితులను కోర్టులో హాజరు పరిచి, రికవరీ సొమ్మును కోర్టుకు అందించనున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం రికవరీ సొమ్ము కోర్టు ద్వారా బాధితులకు అందుతుందన్నారు. ఈ కేసును త్వరగా విచారణ చేసి నిందితులను అరెస్ట్ చేసి, రికవరీ చేసిన ఎస్‌ఐ ఎం.రమాదేవిని, సీఐ ఆర్.వెంకటేశ్వరుర్లు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

నిందితుల వివరాలు..

సర్వారం గ్రామానికి చెందిన భూక్యా బాలు, ధరావత్ గోపా, అజ్మీరా మోతీలాల్, భూక్యా దేవీలాల్, కేలోత్ రమేష్, కేలోత్ వీరు, బానోత్ వీరు, మాలోత్ సీతారాం, జర్పుల గణేష్, బానోత్ మోహన్, మాలోత్ మంగిలాల్, భూక్యా సంతోష్, బానోత్ ప్రేమ్, మాలోత్ రమేష్, మాలోత్ ప్రవీణ్ కుమార్, మాలోత్ లక్ష్మణ్, మాలోత్ సూర్యా, జర్పుల కుమార్, లావుడ్యా శ్రీనివాస్, బానోత్ బాబులాల్, బానోత్ శివ, బానోత్ కుమార్, బానోత్ రమేష్, బానోత్ బిక్కులాల్‌తో పాటు తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన మాగం వెంకటేష్, చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండాకు చెందిన భూక్యా అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

26 నుంచి లైసెన్స్‌డ్ సర్వేయర్లకు శిక్షణ

ఖమ్మం కలెక్టరేట్, మే 17(ఆంధ్రజ్యోతి): లైసెన్స్‌డ్ సర్వేయర్లకు 50 రోజుల పాటు శిక్షణ నిర్వహించనున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నూతన ఆర్వోఆర్, భూభారతి చట్టం ప్రకారం 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, జిల్లా హెడ్ క్వార్టర్ లలో 50 రోజుల పాటు శిక్షణ అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎంపికైన ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లకు మే 26 నుంచి జూలై 26 వరకు 50 రోజుల పాటు ఇల్లెందు క్రాస్ రోడ్డులో ట్రైనింగ్ అండ్ టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ (టీ టీడీసీ)లో శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

గిరిజన గురుకులాల్లో కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

భద్రాచలం, మే17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లోని గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల భర్తీ శనివారం పూర్తయ్యింది. ఐటీడీఏ పీవో బి.రాహుల్ కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ప్రవేశాల ప్రక్రియను పరిశీలించారు. మొత్తం 737 సీట్లకు వంద శాతం భర్తీ చేశామని పేర్కొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

» సింగరేణి చైర్మన్ బలరాం

రుద్రంపూర్, (సింగరేణి) మే 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమష్టి కృషి జరపాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఆదేశించారు. శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు 2.2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని, ఉత్పత్తి చేసిన బొగ్గును రవాణా చేయాలని కోరారు.

గుండెపోటుతో ఐటీసీ ఉద్యోగి మృతి

బూర్గంపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఐటీసీ ఉద్యోగి గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన శనివారం చోటుచేసుకుంది. తోటి కార్మికులు తెలిపిన వివరాలు ప్రకారం...మండల కేంద్రమైన బూర్గంపాడుకు చెందిన ఎండీ షంషుద్దీన్(42) సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం విధులకు హాజరైన ఆయన అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన తోటి కార్మికులు అతనిని ఐటీసీ డిస్పెన్సరీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహనికి కార్మిక సంఘాల నాయకులు, పలు పార్టీల రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుడి జ్ఞాపకార్థం గత 17ఏళ్లుగా బూర్గంపాడు యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంటులో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలుపుతూ జ్ఞాపకాలను గుర్తు చేసుకుని తోటి కార్మికులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వడదెబ్బతో వృద్ధుడు..

తల్లాడ, మే17(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శనివారం వడదెబ్బతో వృద్ధుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన తొర్లపాటి దాసు(80) మృతిచెందాడు. ఎండ తీవ్రతకు తాళలేక శుక్రవారం వడదెబ్బకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని కల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించి ఇంటికి తీసుకువచ్చారు. ఇంటి వద్దే దాసు శనివారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో పశువుల మృత్యువాత

జూలూరుపాడు, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఐదు పశువులు మృతి చెందిన సంఘటన మండలంలోని సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన రైతులు బానోత్ వెంకటేశ్వర్లు, ఉడతల వెంకన్న, మందెరికల రాములు, జూలూరి లక్ష్మి, తేజావత్ సూర్యలు శనివారం ఉదయాన్నే తమ పశువులను మేత కోసం వదిలారు. ఈ క్రమంలో గ్రామ శివారులో ఓ పొలంలో విద్యుత్ స్తంభం పడిపోవడంతో విద్యుత్ తీగలు కిందపడి ఉన్నాయి. దీంతో పశువులు ఆ విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. మృతి చెందిన వాటిలో మూడు దుక్కిటెద్దులు, రెండు ఆవులు ఉన్నాయి. వీటి విలువ రూ.3లక్షలు ఉంటాయని రైతులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ట్రాన్స్‌కో మండల ఏఈ సతీష్ కుమార్ సందర్శించి మృతి చెందిన పశువులను పరిశీలించారు.

పల్లె పల్లెకూ 'భూ భారతి'

(5వ పేజీ తరువాయి)

సమస్యలను రెవెన్యూ సెటిల్మెంట్ రిజిస్టర్(ఆర్ఎస్ఆర్) సవరణ చేయనున్నారు. నేలకొండపల్లి మండలంలో 3 వేల 224 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1726 సాదాబైనామాలున్నాయి, వీటిలో 1179 స్క్రూటిని చేశారు. సాదాబైనామా దరఖాస్తులు కాకుండా వచ్చిన 1498 దరఖాస్తులలో 581 దరఖాస్తులు పరిశీలించారు. 146 ఆమోదించి, 435 తిరస్కరించారు. ఆర్ఎస్సార్ వేరియేషన్ ఉన్న 315 సర్వే నెంబర్ల పరిశీలించిన తర్వాత 112 సర్వే నెంబర్ల సమస్యలను డెస్క్ వర్క్ తో పరిష్కరించారు. మిగిలిన వాటికి క్షేత్ర స్థాయి సర్వే చేపట్టారు. 94 అసైన్మెంట్ దరఖాస్తులు రాగా. సాదాబైనామా దరఖాస్తులు పొజిషన్ చెకింగ్, ఆర్ఎస్సార్. సమస్యలకు సర్వే చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

జూన్ 2 నుంచి సదస్సులు

పి.శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్, ఖమ్మం



రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి అమలు కానున్న నేపథ్యంలో జూన్ 2 నుంచి ప్రతి మండలంలో అన్ని గ్రామాల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నాం. ఇప్పటి వరకు నేలకొండపల్లిలో 15, బోనకల్ మండలంలో 15 రెవెన్యూ గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించాం. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించేందుకు రెవెన్యూ బృందాలు కసరత్తు చేస్తున్నాం.

కిన్నెరసానిలో 'ఆదివాసీ కాంగ్రెస్'

(5వ పేజీ తరువాయి)

ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా కార్యకర్తల శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. కిన్నెరసానిలో శిక్షణ ఏర్పాట్లను పరిశీలించి వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. దేశంలో జరుగుతున్న పరిణామాలు, సవాళ్లు, కర్తవ్యాలు, రాజ్యాంగ చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా కాంగ్రెస్ శ్రేణులను సైద్ధాంతికంగా బలోపేతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల శిక్షణ తరగతులు మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్సీ కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ భంగ్యా, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, న్యాయవాది సునిల్ వివిధ అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు.

ఈ నెల 29న ఆదివాసీ కాంగ్రెస్ శిక్షణ కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభిస్తారని, అతిథులుగా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి సీతక్క, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య పాల్గొంటారని తెలిపారు.

ప్రత్యేక ఆహ్వానితులుగా కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు కొప్పుల రాజు హాజరవుతారని వెల్లడించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులకు ఒక్కో మండలం నుంచి ఇద్దరు పురుషులు, ఒక మహిళా ప్రతినిధి హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ సెనెట్ సభ్యుడు బాలు చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో విఫలం

(5వ పేజీ తరువాయి)

ఇళ్లు దక్కాయన్నారు. గతంలో రాష్ట్రాన్ని పదేళ్ల పరిపాలించిన కేసీఆర్ ప్రభుత్వం కాలయాపన చేసి ప్రజల్ని మభ్యపెట్టిందన్నారు. ప్రజలకు ఇందిరమ్మ ప్రభుత్వం పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వటంలో విఫలమయిందని అన్నారు.

జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రులు గత ప్రభుత్వాలను తిడుతూ కాలం వెళ్లదీస్తున్నారని ఆరోపించారు. డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్ మాట్లాడుతూ 100రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం 500రోజులైనా అమలు చేయలేక పోయిందన్నారు.

అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా సీపీఎం నాయకుల వద్దకు వచ్చి వినతిపత్రాలు, ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం సీపీఎం నాయకులు ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో సమావేశమైనారు. ఈ కార్యక్రమంలో పొన్నం వెంకటేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, ఎస్‌కే మీరా సాహెబ్, పీ రమ్య, భూక్యా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, బండారు రమేశ్, జబ్బార్, బోడపట్ల సుదర్శన్, ఉపేందర్, నాగసులోచన, ప్రవీణ్, యర్రా గోపి, వెంకట్రావు పాల్గొన్నారు



ఆందోళన చేస్తున్న మహిళలు

రీ వాల్యుయేషన్ రిజల్ట్ మరిచారు..!



» కాకతీయ విశ్వవిద్యాలయం అధికారుల తీరు

» ఫలితాలు ప్రకటించకుండానే మరో సెమిస్టర్ నిర్వహణ

» ఆందోళన చెందుతున్న డిగ్రీ విద్యార్థులు



ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 17(ఆంధ్రజ్యోతి): కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నిర్వహణ విభాగం లోపభూయిష్టంగా తయారయిందనే విమర్శలు వస్తున్నాయి. వర్సిటీ అధికారులు డిగ్రీ సెమిస్టర్ పరీక్షల నిర్వహణ అనంతరం పరీక్షలో ఫెయిలయిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో రీ వాల్యుయేషన్ కోసం ఫీజులు తీసుకున్నారు. అయితే సదరు పరీక్షల ఫలితాలను మాత్రం వెల్లడించడాన్ని మాత్రం విస్మరించారు. దీంతో ఎంతో బాగా పరీక్ష రాశామని నమ్మకం ఉన్న విద్యార్థులు రీవాల్యుయేషన్ ఫలితాల కోసం ఎదురు చూసి, రాకపోవడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

ఇటీవల కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీకి సంబంధించి 1, 3, 5 సెమిస్టర్ల పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేశారు. పరీక్ష ఫలితాలతో పాటే ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు రీ వాల్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించారు. దీంతో ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలోని వేల మంది విద్యార్థులు లక్షల రూపాయలను రీ వాల్యుయేషన్ కోసం చెల్లించారు. సాధారణంగా ఫీజులు చెల్లించిన తర్వాత కనీసం 45 రోజులలో ఫలితాలు వస్తాయని విద్యార్థులు చెబుతున్నారు. అయితే సమయం మించిపోతున్నా రీ వాల్యుయేషన్ ఫలితాలను మాత్రం పరీక్షల విభాగం అధికారులు వెలువరించలేదు. దీంతో విద్యార్థులు తమ పరీక్ష ఫీజులు ఎటు పోయాయని, దీనికి వర్సిటీ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

1, 3, 5 సెమిస్టర్ల రీ వాల్యుయేషన్‌కు సంబంధించిన ఫలితాలను పరీక్షల విభాగం ప్రకటించకముందే 2,4,6 సెమిస్టర్లతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే విద్యార్థులు రీ వాల్యుయేషన్‌లో ఫలితాలు చూసుకుని, అనంతరం పరీక్ష ఫీజులు చెల్లించాలని భావించారు. రీ వాల్యుయేషన్‌లో పాస్ అయితే మరో సబ్జెక్టుకు దృష్టి సారించవచ్చని అనుకున్నారు. కాని అధికారులు మాత్రం రీ వాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేయకుండానే మరో సెమిస్టర్ పరీక్ష ప్రకటన విడుదల చేసి పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు.

పరీక్షా కేంద్రాల్లోనూ గందరగోళమే..

డిగ్రీ 2,4,6 సెమిస్టర్ల పరీక్షల నిర్వహణకు సంబంధించి గత వారంలో పరీక్షా కేంద్రాల విషయంలో గందరగోళంగా వివరాలు ప్రకటించారు. మొదట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మాత్రమే పరీక్ష కేంద్రాలు ఉంటాయని, ఆ తర్వాత అన్ని డిగ్రీ కళాశాలలకు సెల్ఫ్ సెంటర్లు ఇచ్చామని, అనంతరం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి గందరగోళంగా వ్యవహరించారు. ఒక కాలేజీ విద్యార్థులను మరో కాలేజీలో పరీక్ష రాయాలని సూచించారు. మొదట జారీ చేసిన హాల్ టికెట్లలో ఉన్న పరీక్షా కేంద్రాలకు, ఆ తరువాత ప్రకటించిన కేంద్రాల్లో మార్పులు ఉండటంతో విద్యార్థులు అవస్థలు పడ్డారు.

చివరకు రేపు పరీక్షలు అనగా ముందు రోజు రాత్రి 10 గంటల తర్వాత హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టారు. ఇటు పరీక్షలు నిర్వాహణలోను, రీ వాల్యుయేషన్ ఫలితాలు వెల్లడించడంలోనూ పరీక్షల నిర్వహణ యంత్రాంగం విఫలమైందని విద్యార్థులు విమర్శిస్తున్నారు.

దేశ అభివృద్ధికి పాలకులు కావాలి



విద్యార్థులకు లాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం గాంధీ చౌక్, మే 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మన భవిష్యత్తు పౌరులు మాత్రమే కాక, దేశ అభివృద్ధికి పాలకులు కావాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి బోర్డు పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని అవకాశాల్లో ముందంజలో ఉండగలరని, ఇలాంటి ప్రోత్సాహక కార్యక్రమాలు వారి ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు చాలా దోహదపడతాయని పేర్కొన్నారు. శ్రీమిత్రా ఫౌండేషన్ చైర్మన్ కురువెళ్ల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మొత్తం రూ.3లక్షల విలువైన బహుమతులు, డిల్లీ యాత్ర అవకాశాలు విద్యార్థులకు లభించాయని తెలిపారు. ఖమ్మం జిల్లా విద్యాధికారి, మిత్ర గ్రూప్ డైరెక్టర్లు రంగా శ్రీనివాస్, పాలవరపు శ్రీనివాస్, చారుగుండ్ల రవికుమార్,చెరుకూరి యుగేందర్, నాగసాయిగ్యాస్ నాగేష్, ప్రసేన్, ఎస్ఆర్ఐ ఫౌండేషన్ బాధ్యులు బయ్యన్న, బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, పసుమర్తి రంగారావు, వాసిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. బహుమతులు అందుకున్న విద్యార్థులు పచావ వెన్నెల(ఖమ్మం రూరల్ జలగంనగర్ ఉన్నత పాఠశాల), మా ఘం యశ్వంత్(మధిర ఉన్నత పాఠశాల), చింతోజు సాయి(మధిర ఉన్నత పాఠశాల), తిరుమలదాసు(రెబ్బవరం ఉన్నత పాఠశాల), రామిశెట్టి ఉమా(ఖాజీపుర ఉన్నత పాఠశాల), ఆవుల శ్రీమన్య(మేడుపల్లి ఉన్నత పాఠశాల), గోడ లక్ష్మి(అడసర్లపాడు ఉన్నత పాఠశాల), పుచ్చకాయల భవ్య(అడసర్లపాడు ఉన్నత పాఠశాల), చండా భావన(బల్లేపల్లి ఉన్నత పాఠశాల) విద్యార్థులు ఉన్నారు.

విజేతకు న్యాయాధికారి అభినందన



వంశీని అభినందిస్తున్న న్యాయాధికారి శివనాయక్

భద్రాచలం, మే 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన భద్రాచలం సిటీ స్టైల్ జిమ్‌కు చెందిన క్రీడాకారుడు మోడెం వంశీని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ అభినందించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలలో బంగారు పతకాలు సాధించి దేశం ఖ్యాతిని ఇనుమడింపజేసిన వంశీ ఏజెన్సీ వారు కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ స్టైల్ జిమ్ కోచ్ రామిరెడ్డి, వైద్యులు డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్, సీనియర్ న్యాయవాదులు రావి రామ్మోహన్‌రావు, పామరాజు తిరుమలరావు, సాధనపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసగించిన వ్యక్తిపై కేసు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ. లక్షలు తీసుకొని పలువురిని మోసగించిన వ్యక్తిపై ఖమ్మం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మహ్మద్ మున్వర్ అలీ అనే వ్యక్తి ఖమ్మం సారథీనగర్‌లో గత కొన్నేళ్లుగా భార్యతో కలిసి నివసిస్తూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. తనకు ఎందరో పెద్దలతో పరిచయం ఉందని, వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నమ్మించి అతను 2023 డిసెంబరులో పలువురి వద్ద నుంచి రూ. 19 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా గత ఆరు నెలలుగా మున్వర్ అలీ కనిపించకుండా పోయాడు. దీనిపై కవిరాజ్‌నగర్‌కు చెందిన బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నేడు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

» నగరంలో 7 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఐఐటీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం జరగనున్నది. ఖమ్మంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. పేపర్ 1 ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులు రెండు గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాల, బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల, దరిపల్లి అనంతరాములు ఇంజనీరింగ్ కళాశాల, విజయ ఇంజనీరింగ్ కళాశాల తనికెళ్ల, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల పొన్నెకల్లు, ప్రియదర్శిని సైన్స్ అండ్ టెక్నాలజీ ఉమెన్ పెద్దతండా, సత్తుపల్లిలో ఓ పరీక్షా కేంద్రంలో పరీక్షలు నిర్వహించనున్నారు.

నల్లబంగారు లోకం..

(5వ పేజీ తరువాయి)

సంవత్సరాల పాటు బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. సంవత్సరానికి 2.5 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా తగిన ప్రణాళికలు రూపొందించిన యాజమాన్యం ఓబీ వెలికి తీసేందుకు టెండర్లను సైతం పూర్తి చేసినట్లుగా ప్రకటించారు. ఇల్లెందు ఏరియాలో బొగ్గుగనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో నూతన ఓసీ ఏర్పాటుకు పర్యావరణ అనుమతులు రావడం పట్ల కార్మికులు, కార్మిక సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

లంబాడీలు గిరిజనులు కాదు...

» నేడు ఇల్లెందులో ఆదివాసీ గర్జన సభ, ర్యాలీ

» నిర్వాహక కమిటీ కన్వీనర్ జోగా రాంబ్రహ్మం

ఇల్లెందు, మే 17(ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదిమ తెగల ప్రజలను కాపాడాలని కోరుతూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో ఆదివారం ఇల్లెందు పట్టణంలో ర్యాలీ, సభ నిర్వహించేందుకు నాయకులు విస్తృత ఏర్పాట్లు చేశారు. సభకు భారీగా ఆదివాసీ గిరిజనులను తరలించేందుకు నాయకులు ఏజెన్సీ ప్రాంతాల్లో వారం రోజులుగా ప్రచారం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ఆమోదం లేకుండా చట్టవిరుద్ధంగా లంబాడాలను ఎస్టీ జాబితాలో కొనసాగిస్తున్నారని, ఆదివాసీ విద్యా, ఉపాధి అవకాశాలు కొల్లగొడుతున్నారని ఆరోపిస్తూ ఆధార్ సొసైటీ, తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘాలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహక కమిటీ కన్వీనర్ జోగా రాంబ్రహ్మం శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివాసీల అస్థిత్వం కోసం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరాటంలో తాడోపేడో తేల్చుకుంటామన్నారు. ఆదివాసీల అస్థిత్వం కోసం మరో ఉద్యమం సిద్ధం అయినట్లు తెలిపారు. ఇల్లెందులో ఆదివారం సాయంత్రం ఆదివాసుల ర్యాలీ జరుగుతుందని, జేకే కాలనీ సింగరేణి కాలరీస్ స్కూల్ గ్రౌండ్‌లో ఆదివాసీ గర్జన సభ జరుగుతుందని తెలిపారు. సభకు పార్లమెంట్ మాజీ సభ్యుడు సోయం బాపురావు, ఆధార్ సొసైటీ జాతీయ కన్వీనర్ జేజే రాంబాబు, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరమణ, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి రామస్వామి, ఆదివాసీ సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తెల్లం వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, రామనాథం, పాపయ్యలు ప్రసంగిస్తారని తెలిపారు.

నకిలీ విత్తనాలపై నజర్

(5వ పేజీ తరువాయి)

పట్టాయి. ఈఏడాదికూడా ముందస్తు చర్యల ద్వారా నకిలీ విత్తనాల నివారణ కోసం వ్యవసాయశాఖ దృష్టిపెట్టింది. ఇప్పటికే బ్రాడెండ్ కంపెనీ విత్తనాలను జిల్లాలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది.

ఖమ్మం జిల్లాలో వానాకాలంలో 5,80,232 ఎకరాలు పంటసాగుకు ప్రణాళిక సిద్ధంచేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వానాకాలం ప్రణాళిక కింద వ్యవసాయశాఖ సిద్ధంచేసింది. జిల్లాలో 6,31,124 ఎకరాలల్లో పంటలుసాగు జరగనుందని వ్యవసాయశాఖ సిద్ధంచేసింది. ఇందుకు సంబంధించిన విత్తనాలను కూడా అధికారులు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.

నకిలీ విత్తనాలను నివారిస్తాం.. పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో నకిలీ విత్తనాలు నివారించేందుకు ఇప్పటికే వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు కూడా వేయబోతున్నా. సోమవారం జిల్లాలో వ్యవసాయశాఖ డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్నాం. అలాగే మండల, జిల్లాస్థాయిలో టాస్క్‌ఫోర్సు టీంలు ఏర్పాటు చేసి నకిలీ విత్తనాల నియంత్రణకు తనిఖీలు చేపడతాం. నిరంతరం విత్తనాల విక్రయాలపైనే నిఘా ఉంచి ఎక్కడైనా గుర్తింపులేని విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

తవ్వకాల్లో బయటపడ్డ బుద్ధ విగ్రహం



చింతకాని, మే 17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు నిర్వహిస్తుండగా కూలీల తవ్వకాలలో ఓ పురాతన బుద్ధ విగ్రహం లభ్యమైన ఘటన మండలంలోని నాగులవంచ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు కొల్లేటి నాగేశ్వరరావు వ్యవసాయ భూమిలో శనివారం ఉపాధిహామీ పనుల్లో భాగంగా భూమి చదును చేస్తున్న కూలీలకు పాలరాతి బుద్ధ విగ్రహం తగలడంతో జాగ్రత్తగా తవ్వి బయటకు తీశారు. ఇదే ప్రాంతంలో అనేక పురాతన ఇటుకలు, కుండలు కూడా లభ్యమైనట్లు రైతు తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు పరిశోధనలు నిర్వహిస్తే చరిత్రకు సంబంధించిన ఆనవాళ్లు లభ్యమయ్యే అవకాశం ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ఖమ్మంస్పోర్ట్స్, మే 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సుమారు 73 మంది బాధితులకు రూ.19.16 లక్షల విలువైన చెక్కులను అందించారు. ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ పరిమితిని తగ్గించి పేదలకు సహాయం అందకుండా చేయడం సమంజసం కాదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అందరికీ అపరిమితంగా సాయం చేసిందని గుర్తు చేశారు. ప్రభుత్వ సాయం తగ్గించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు తీవ్రవ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తాజుద్దీన్, కనగాల వెంకటరావు, లక్ష్మారెడ్డి, పసుమర్తి రామ్మోహన్ తదితరులు ఉన్నారు.


ర్యాలీలో పాల్గొన్న మేయర్ నీరజ, జావీద్, శరత్‌కుమార్

రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్న బీజేపీ

- ప్రజల్లో సమైక్యతను పెంచేందుకే 'జైసంవిధాన్' యాత్రలు
- మేయర్ పునుకొల్లు నీరజ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్

ఖమ్మంసంక్షేమవిభాగం, మే17(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని దెబ్బతీసే కుటిల ప్రయత్నాలను బీజేపీ ప్రభుత్వం చేస్తోందని, ఈ నేపథ్యంలో ప్రజల్లో సమైక్యతను పెంపొందించేందుకు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా జై బాపూ,జైసంవిధాన్‌యాత్రలు నిర్వహిస్తోందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శనివారం ఖమ్మం నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రెండో పట్టణ కమిటీ పరిధిలోని 44, 45,49,50 డివిజన్లలో ఈ ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్లు రాపర్తిశరత్‌కుమార్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు భారీగా జనసమీకరణ చేశారు. ప్రధాన రహదారుల వెంట ర్యాలీ నిర్వహించారు. నగర అధ్యక్షుడు ఎండీ జావీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోంశాఖ మంత్రి అవమానించారనిఆరోపించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఖమ్మం నియోజకవర్గం రాష్ట్రంలోనే మోడల్‌గా నిలుస్తోందన్నారు. కాంగ్రెస్ చేసే అభివృద్ధిని చూడలేక కొన్ని పార్టీలు రాజకీయ అలజడి కోసం ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఈర్యాలీలో బీరెడ్డి రమేశ్, లింగం నరేందర్, ఉమర్, గంటా భీమయ్య, గుడవర్తి శ్రీను, సోమ సత్యనారాయణ, గిరి, రమణ, ఉపేంద్ర, సునిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల ధాన్యమే కొంటారా?




రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు,ధాన్యం బస్తాలను వేసి నిరసన తెలుపుతున్న రైతు, ధాన్యం లారీని ఆపిన తహసీల్దార్

- నేలకొండపల్లి మార్కెట్లో రైతుల ఆందోళన
- మార్కెట్ ఎదుట పంటను వేసి నిరసన

నేలకొండపల్లి,మే17(ఆంధ్రజ్యోతి): మార్కెట్లోని కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడంటూ శనివారం సాయంత్రం రైతులు ఆందోళనకు దిగారు. రైతుల ధాన్యం లోడు చేయకుండా, నేలకొండపల్లికి చెందిన వ్యాపారికి చెందిన దాదాపు 400టిక్కీల ధాన్యాన్ని లోడు చేయటం పట్ల రైతులు తీవ్రఅభ్యంతరం వ్యక్తం చేశారు. దాదాపుగా రెండు నెలలుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో వేసినప్పటికీ,లారీల్లోకి లోడు చేసి, మిల్లులకు పంపటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తన ధాన్యం మార్కెట్లో వేసి దాదాపు 45 రోజులవుతున్నప్పటికీ మిల్లులకు పంపలేదని ఆరోపిస్తూ తాతా హనుమంతరావు అనే రైతు ధాన్యం బస్తాలను మార్కెట్ ఎదుట రోడ్డుపై వేసి నిరసన తెలిపాడు. తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. రైతుల ధాన్యం గాకుండా వ్యాపారుల ధాన్యం ఎలా కాంటా వేస్తారంటూ నిలదీశాడు. తహసీల్దార్ కొనుగోలు కేంద్రం నిర్వాహకుని వివరణ కోరగా వ్యాపారి ధాన్యం ఎత్తలేదని చెప్పగా, హమాలీలు, రైతులు వ్యాపారి పేరుతో సహా చెప్పి గొడవకు దిగారు. అందులో ఈసీజన్‌లో సివిల్ సప్లయిస్ పంపిన బస్తాలపై ఎటువంటి స్టిక్కర్లు లేకపోయినప్పటికీ, వ్యాపారికి చెందిన ధాన్యంగా చెప్పబడుతున్న బస్తాలపై ఆచార్లగూడెం స్టిక్కర్లు ఉండటం గమనార్హం. కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు సైతం తహసీల్దార్‌తో వ్యాపారి పేరు చెప్పి, అనంతరం సరిదిద్దుకున్నాడు. కూనవరం 1638 రకం టిక్కీలు దాదాపుగా 189 లారీలో లోడ్ చేశారు. మిగిలిన రైతులవి ఎత్తకుండా, మిల్లులకు తోలటం లేదని చెప్పటం సైతం పలు అనుమానాలకు తావిస్తోంది. లోడు చేసిన లారీని పూర్తిగా తనిఖీ చేసే వరకు పంపవద్దని తహసీల్దార్ ఆదేశించారు. తహసీల్దార్ వెళ్లిన అనంతరం లారీని బయటకు తీసుకెళుతుంటే హనుమంతరావు అనే రైతు లారీకి అడ్డుపడ్డాడు. ఈసీజన్ మొదటి నుంచీ కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు నవీన్ వ్యవహార శైలి అనుమానాస్పదంగానే ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. నేలకొండపల్లి మార్కెట్ యార్డులో డీసీఎమ్మెస్ కొనుగోలు కేంద్రంలో జరిపిన కొనుగోళ్లలో పూర్తిగా అవకతవకలు జరిగాయని, విచారణ జరిపితే నిజాలన్నీ వెలుగులోకి వస్తాయని రైతులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణం విచారణ జరపాలన్నారు.

ఆయిల్ పామ్‌తో రైతులకు ఆదాయం

కూసుమంచి ఏడీ సరిత



ఖమ్మంరూరల్, మే17(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం పొందవచ్చని కూసుమంచి ఏడీ సరిత అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని గుదిమళ్ల గ్రామంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగు విధానం, ప్రభుత్వ సహకారంపై రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలకాలన్నారు. మార్కెట్‌లో లాభదాయక పంటలను గుర్తించి సాగు చేస్తే ఆశించిన ఫలితాలు పొందవచ్చు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ సాగు జిల్లా రైతాంగానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. తక్కువ నీటి వనరులతో ఎక్కువ ఎకరాల్లో సాగు చేయవచ్చని చెప్పారు. అంతేకాకుండా ఈపంట ప్రకృతి వైపరీత్యాలను సైతం తట్టుకుంటుందన్నారు. ప్రతీ ఒక్కరైతు ఆయిల్‌పామ్ సాగు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓనగేష్, ఏఈఓలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

కొణిజర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు విగ్రహ ఏర్పాటు కోసం శనివారం మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో వైరా మున్సిపాలిటి పరిధి 17వవార్డులో మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్ శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలనేది పల్లిపాడు గ్రామస్తుల చిరకాల స్వప్నమని ఆయన తెలిపారు. గ్రామస్తులు ఐక్యతతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి చలపతిరావు, నంద్యాల రవికుమార్, మాజీ కౌన్సిలర్‌లు ధనేకుల వేణు, తడికమళ్ళ నాగేశ్వరరావు, మాదిన్ని రామారావు, వెంకటేశ్వరరావు, దామా శ్రీనువాసరావు, వెంకట్, శ్రీనివాసరావు, హుద్దండు, సాయి, నాగభూషణం, కోటి, నరసింహారావు, రవి, శ్రీను, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణాపై సమాచారం అందించండి

సీపీ సునీల్ దత్

ఖమ్మంఖానాపురంహవేలి, మే17(ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం ఉంటే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, ఏ సంస్థలు, కార్యకర్తలు, ఇతరులు ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి వాహనాలను స్వయంగా అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ శనివారం హెచ్చరించారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే 7చెక్‌పోస్టుల ద్వారా చర్యలు తీసుకున్నామని చెప్పారు. పశువులను రవాణా చేసే ప్రతీ వాహనానికి ప్రమాణిక పత్రాలు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే వారి వాహనాలు సీజ్ చేస్తారని అన్నారు. బక్రీద్ సందర్భంగా ఎలాంటటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలి

ఖమ్మంఖానాపురంహవేలి, మే17(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరంలో ప్రారంభం నాటికి ఉపాధ్యాయుల సర్దుబాటును పారదర్శకంగా చేపట్టాలని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణకు వినతిపత్రం అందించారు.2024-25లో సర్దుబాటు చేశారని, ఆతరువాత ఖాళీల స్థానంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, డీఎస్సీ 2024తో ఖాళీలతో నింపారని గుర్తు చేశారు. డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయులకు నేటికి వారి మాతృస్థానానికి పంపలేదని వివరించారు. వారిని వారి మాతృ స్థానానికి పంపిన అనంతరమే సర్దుబాటు చేయాలని కోరారు.

నేలకొండపల్లి టీడీపీలో పోటీ

- మండలాధ్యక్ష పదవికి బరిలో ముగ్గురు
- నివేదికను జిల్లా కమిటీకి పంపిన ఎన్నికల పరిశీలకుడు


మాట్లాడుతున్న అప్పారావు

నేలకొండపల్లి, మే17(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్ష ఎన్నికపై పోటీ నెలకొంది. ముగ్గురు పోటీ పడుతుండటంతో ఎన్నికల పరిశీలకుడు నివేదికను జిల్లా కమిటీకి అందజేస్తానని టీడీపీ పాలేరు నియోజకవర్గ పరిశీలకుడు మల్లెంపాటి అప్పారావు చెప్పారు. పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం సింగారెడ్డిపాలెం శ్రీరామమందిరంలో జరిగిన మండల పార్టీ గ్రామ శాఖల అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో అప్పారావు పాల్గొన్నారు. నలమాస మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ టీడీపీ పాలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బలంగా ఉందన్నారు. మండలంలోని అన్ని గ్రామాల కమిటీలను ఎకగ్రీవంగా ఎన్నుకోవటం అభినందనీయమన్నారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవటానికి ప్రయత్నించగా ఏకాభిప్రాయం కుదరలేదు. అధ్యక్ష పదవికి ముగ్గురు నలమాస మల్లయ్య, గోగినేని సీతారామబాబు, నూకహనుమంతరావు పోటీ పడ్డారు. గ్రామ శాఖల అధ్యక్ష, కార్యదర్శులను విడివిడిగా పిలిచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. గ్రామశాఖల అధ్యక్ష, కార్యదర్శుల అభిప్రాయాలను జిల్లా కమిటీకి నివేదిస్తామని, జిల్లా కమిటీ నిర్ణయం మేరకు మండల కమిటీని ప్రకటించనున్నట్లు అప్పారావు ప్రకటించారు. బోదులబండ, చెర్వుమాధారం గ్రామ కమిటీల ఏర్పాటుపై ఆయా గ్రామాల కార్యకర్తలు భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో సోమవారం బోదులబండ, చెర్వుమాధారంలలో పార్టీ గ్రామకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేస్తామని పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ చెప్పారు. సమావేశంలో కొండబాల కరుణాకర్, సూరపనేని రామకృష్ణ, గడుపూడి వెంకటేశ్వరరావు, అక్కినేని నాగేశ్వరరావు, వీసం శ్రీనివాసరావు, కోలేటి మస్తాన్‌రావు, మద్దినేని మహేష్, కారంగుల వీరబాబు, తాటికొండ నాగేశ్వరరావు, మురుకొండ అచ్చయ్య, వంకాయలపాటి పద్మ, తీగ వెంకటేశ్వర్లు, తీగ రాములు, దుడ్డెల గోపాలరావు, రావెళ్ళ వెంకటేశ్వర్లు, పచ్చా సీతారామయ్య, బల్లి వెంకన్న, నూతక్కి ప్రసాద్, కాసాని బడేమియా తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల

ఖమ్మంసంక్షేమవిభాగం,మే17(ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వేజండ్ల సాయికుమార్ ఆరోపించారు. జిల్లా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం ప్రధాన రహదారిపై కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.రాహుల్‌గాంధీ బీహార్ పర్యాటనను బీజేపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా అడ్డుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలగంగాధర్, ఆదర్శనాయుడు, కుక్కల మహేష్, క్రాంతికుమార్, కిరణ్; సత్యం, ఖైజర్, నాగజారు, ఆర్‌కే నాయుడు, జితేందర్, సాయి పాల్గొన్నారు.

18 లేఅవుట్లకు అనుమతుల జారీ

కేఎంసీలో డీఎంసీ సమావేశంలో ఆమోదం


మాట్లాడుతున్న కమిషనర్ అగస్త్య

ఖమ్మంసంక్షేమవిభాగం, మే17(ఆంధ్రజ్యోతి): జిల్లా లేఅవుట్ కమిటీ సమావేశం శనివారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య నిర్వహించారు. మొత్తం 30లేఅవుట్‌కు సంబంధించిన దరఖాస్తులు రాగా, కమిటీ సభ్యులు 18వాటికి అనుమతిచ్చారు. ఈ సందర్భంగా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ రెవెన్యూ, ఇరిగేషన్, లైన్‌డిపార్టుమెంట్ ప్రభుత్వశాఖల అధికారులు లేఅవుట్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉన్నవాటికే అనుమతులకు సిఫారసు చేయాలన్నారు.

నిరసన.. నిరీక్షణ

- కేఎంసీ ఎదుట సీపీఎం ఆందోళన
- ఎండలో అల్లాడిన చంటి పిల్లలు, తల్లులు


ఎండలో చంటి పిల్లతో నిరీక్షిస్తున్న తల్లి

ఖమ్మంసంక్షేమ విభాగం,మే17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమం కారణంగా సాధారణ ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. నిరసనకారులు ఎవ్వరో... సామాన్య ప్రజలు ఎవ్వరో పోలీసులు గుర్తించక పోవటంతో తరుచూ ఇటువంటి సమస్య ఏర్పడుతుంది. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు విధులకు వచ్చే ఉద్యోగుల నుంచి సామాన్య ప్రజల వరకు చంటి పిల్లలతో ఎండలో నిరీక్షిస్తున్నారు. శనివారం ఖమ్మం నగర పాలకసంస్థ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిరసన కార్యక్రమం జరిగింది. అయితే కేఎంసీ కార్యాలయం గేటు ఉదుట బారీకేడ్స్‌ను పోలీసులు ఏర్పాటు చేశారు. లోపలికి ఎవ్వరనీ అనుతమతించలేదు. దీంతో కేఎంసీ కార్యాలయంలో విధులకు వచ్చే ఉద్యోగులు ఇబ్బంది పడ్డారు. మీసేవా సెంటర్‌కు ఆధార్ ఇతర ధ్రువపత్రాల కోసం వచ్చిన సామాన్య ప్రజలు ఎండలో చంటి పిల్లల్ని ఎత్తుకొని నిరీక్షించారు.

ఉపాధ్యాయ శిక్షణ శిబిరం తనిఖీ


మాట్లాడుతున్న విజయలక్ష్మీబాయ్

ఖమ్మం ఖానాపురంహవేలి, మే17(ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణ శిబిరాన్ని శనివారం విద్యాశాఖ సిట్ డైరెక్టర్ విజయలక్ష్మీ బాయ్ సందర్శించారు. తరగతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో బడిబాట, పాఠ్యపుస్తకాల సరఫరా, యూనిఫాం, తదితర అంశాలపై సమీక్షించారు.విద్యాసంవత్సరం త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో సమర్థవంతంగా విద్యావ్యవస్థను నడిపించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సామినేని. సత్యనారాయణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. వివిధ సమస్యలపై ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు.

కిష్టారం పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణయ్య మృతి

సత్తుపల్లి మే17 (ఆంధ్రజ్యోతి) సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారం గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు మామిళ్ళపల్లి కృష్ణయ్య (82) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. కొంతకాలంగా ఆయన అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌లో మృతి చెందారు. కృష్ణ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సంతాపం తెలిపారు.

హార్వెస్ట్‌లో ముగిసిన సమ్మర్ క్యాంప్ వేడుకలు


మాట్లాడుతున్న డీఈవో

ఖమ్మంఖానాపురంహవేలి,మే17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హార్వెస్ట్ టెండర్ రూట్స్, సెడార్‌వ్యాలీ, స్ప్రింగ్ లీఫ్ పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శనివారంలో ముగిశాయని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. సెడార్ వ్యాలీ సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలకు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యానారాయణ, కరస్పాండెంట్ రవిమారుత్, డైరెక్టర్లు పార్వతీరెడ్డి, ఉదయశ్రీ హాజరై మాట్లాడారు. చిన్నారుల్లో కళానైపుణ్యాన్ని పెంపొందించేందుకు ఆర్ట్స్ క్రాఫ్ట్స్ శిక్షణ, నృత్య సాధన, చెదరంగం,చిత్రలేఖనం తదితర అంశాలను చిన్నారులకు నేర్పించామన్నారు. స్ప్రింగ్‌లీఫ్, టెండర్ రూట్స్ పాటశాలల్లోను ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్,మే17(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలని 30న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం, ముత్యాలగూడెం గ్రామంలో జరుగుతున్న ఉపాదిహమి పని ప్రదేశాన్ని శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జోగుపర్తి కుటుంబానికి కందాళ పరామర్శ

తిరుమలాయపాలెం,మే17(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాళ్లచెరువు గ్రామ మాజీ సర్పంచ్ జోగుపర్తి వెంకటేశ్వర్లు సోదరుడు జోగుపర్తి ప్రసాద్ కుటుంబసభ్యులను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, బీఆరెస్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శనివారం పరామర్శించారు. జోగుపర్తి ప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. చిత్రపటానికి వారు పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రసాద్ మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు బెలలం వేణు, ఇంటూరి శేఖర్, నాయకులు బోడ మంచానాయక్, వాలూరి దామోదర్, గడిపుడి రాజా, మానుకొండ రాజా తదితరులు పాల్గొన్నారు.

నాట్య ప్రదర్శనలో జైశ్రీ ప్రతిభ



ఖమ్మంచర్చికాంపౌండ్,మే17(ఆంధ్రజ్యోతి):హైదరాబాదులోని రవీంద్రభారతిలో విష్ణువిలాసం నృత్య ప్రదర్శనలో భాగంగా ఖమ్మం పట్టణానికి చెందిన జైశ్రీ నాట్య ప్రదర్శనలో ప్రతిభ చాటింది. ఈ వివరాలు కూచపూడి నాట్యగురువు సందిరెడ్డి మాధవరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, గాయకుడు గోరెటి వెంకన్న బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జైశ్రీ తల్లిదండ్రులు నైనకంటి హరికృష్ణశరమ్మ, గాయత్రి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి హఠాన్మరణం

తిరుమలాయపాలెం,మే17(ఆంధ్రజ్యోతి):మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన మాగిజాలి(55) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం గ్రామపంచాయతీ విధులలో నిమగ్నమై మధ్యాహ్నం ఇంటికి వెళ్లాడు. భోజనం చేసిన అనంతరం సేదతీరుతుండగా, గుండెలో నొప్పి వస్తుందని భార్యకు చెప్పాడు. సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఇళ్ల బాధితులకు న్యాయం చేయాలి

- సీపీఐ నేతలు మౌలానా


బాధితులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఖమ్మంరూరల్, మే17(ఆంధ్రజ్యోతి): మున్నేటిపై నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జితో పాటు ఖమ్మం-మహబూబాబాద్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్రకంట్రోల్ కమిటీ చైర్మన్ మహ్మద్ మౌలానా, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్, తాళ్ళేసితండాలో సీపీఐ జిల్లా బృందం శనివారం పర్యటించింది. బాధితుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతు జలగంనగర్‌లో పేదలు 45 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నాయన్నారు. కేబుల్ బ్రిడ్జి ఏర్పాటుతో నిరాశ్రయులు అవుతున్నారన్నారు. అధికారులు ఎటువంటి ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా నిరాశ్రయులను చేయడం దారుణమన్నారు. తాళ్ళేసితండా వద్ద రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించనున్న ఇళ్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కర్ణకుమార్, సింగు నరసింహారావు, చిన్న వెంకటరెడ్డి, రాంమూర్తి,రంగారావు, రామకోటి, లక్ష్మీనారాయణ, కళావతి, చంద్రరావు, దండి రంగారావు, సురేందర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



పశు వైద్యశాలల మరమ్మతులకు నిధులు

మధిరటౌన్ ,మే 17 (ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో 31 పశు వైద్యశాలల మరమ్మతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.82.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిర డైరీ లబ్ధిదారులకు పశపోషణలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పశువులకు మెరుగైన వైద్యం అందించేందుకు పశు వైద్యశాలలు ఉపయోగపడనున్నాయని అన్నారు. ఈనిధులతో గ్రామీణ రైతులకు, పాడి రైతులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు.

సబ్‌జైల్లో న్యాయ చైతన్య సదస్సు



సబ్‌జైలులో న్యాయ చైతన్య సదస్సులో ప్రసంగిస్తున్న ఎం.శ్రీనివాస్

సత్తుపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీనివాస్ కోరారు. సత్తుపల్లి సబ్‌జైలులో శనివారం న్యాయ చైతన్య సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాలపై కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జైలు పరిసరాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.మీరా ఖాసింసాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి బిఎస్ఎన్.సుమబాల, జైలు సూపరింటెంట్ యు.కుటుంబరావు, అడ్వకేట్లు ఎన్.విజయకుమార్, బి.వెంకట్రావు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు

బోనకల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మోటమర్రి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిర్వహణ చేయనున్నందున విద్యుత్ సేవలకు అంతరాయం ఉంటుందని ఏఈ మనోహర్ తెలిపారు. ఈ నెల 18, 19, 20 తేదిలలో విద్యుత్ లైన్ల మరమ్మతుల పనులు చేపడుతున్నందున ఆళ్లపాడు, గోవిందాపురం(ఎ), రాయనపేట, మోటమర్రి గ్రామాలలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నందున ప్రజలు సహకరించాలని కోరారు.

టీడీపీ మధిర టౌన్ అధ్యక్షుడిగా హనుమంతరావు

మధిరరూరల్, మే 17 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ మధిరపట్టణ అధ్యక్షుడుగా మల్లాది హనుమంతరావు ఏకగ్రీవ్రంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా సట్టు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడుగా మేడా వెంకటేశ్వర రావుతోపాటు మరికొంతమందిని కమిటీ సభ్యులుగా ఎంపికచేశారు. శనివారం మధిరలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అధ్యక్షతన నూతన కమిటీని ఎంపికచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27,28,29తేదీల్లో కడపలో జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు చేకూరు శేఖర్‌బాబు, వేమూరు సునిల్‌కుమార్, వంగాల రామకోటి, మేడేపల్లి రాణి, చెరుకూరి కృష్ణారావు, దేవభక్తిని వెంకట్, వేల్పుల కొండ, మారేడు పుల్లారావు, పాశం రామనాధం తదితరులు పాల్గొన్నారు.

కిష్టారం పీఏసీఎస్ అధ్యక్షుడి మృతి



ఎం. కృష్ణ (ఫైల్‌ఫొటో)

సత్తుపల్లి మే 17 (ఆంధ్రజ్యోతి) సత్తుపల్లి మండల పరిధిలోని కిష్టారం గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడు మామిళ్ళపల్లి కృష్ణయ్య (82) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో హైదారాబాద్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన మృతి చెందారు. కృష్ణ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు కుటుంబ సభ్యులకు సానుభూతి సంతాపం తెలిపారు.

టీడీపీ గ్రామ కమిటీల ఎంపిక పూర్తి

తల్లాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా తల్లాడ మండలంలో నూతన గ్రామకమిటీల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కూచుపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం నాటికి మండలంలోని ఆరు గ్రామాల్లో గ్రామకమిటీలు ఎన్నుకోవడం జరిగిందని, ఈ మేరకు గోపాలపేట గ్రామ అధ్యక్ష కార్యదర్శులుగా రాయల సీతారామారావు, దిరిశాల రవి, అన్నారుగూడెం అధ్యక్ష కార్యదర్శులుగా గొడ్ల వెంకటరత్నం, కందుల నారాయణ, కొత్త వెంకటగిరి అధ్యక్ష కార్యదర్శులుగా సాయిన్ని నాగేశ్వరరావు, కంచెపోగు ఏలి, కలకొడిమ అధ్యక్ష, కార్యదర్శులుగా సూర్యదేవర రాజేష్, షేక్ సైదులు, లక్ష్మీపురం అధ్యక్ష కార్యదర్శులుగా శీలం రామకోటారెడ్డి, గుర్రాల లక్ష్మారెడ్డి, కుర్నవల్లి అధ్యక్ష కార్యదర్శులుగా శీలం సత్యనారాయణరెడ్డి, చల్లా శ్రీను ఎన్నికైనట్లు ఆయన తెలిపారు.

నకిలీ విత్తనాలను నమ్మొద్దు



ఏవో బాలాజి

కొణిజర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం మాసం వస్తుందని గ్రామాలలోకి వివిధ రకాల విత్తన కంపెనీలు వస్తున్నాయని, రైతులు నకిలీ విత్తనాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి బాలాజి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలోకి విత్తన కంపెనీల వారు నకిలీ విత్తనాల ప్రచారర్థం వస్తున్నారని, రైతులు ఇదే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతుందని సూచించారు. విత్తన కంపెనీ వారు ప్రతి గ్రామాం టార్గెట్‌గా ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకుని నకిలీ విత్తనాలు అంటగట్టే అవకాశం ఉందన్నారు. షాపులో దొరికే విత్తనాలు కంటే తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మవద్దని తెలిపారు. గ్రామాలలోకి నకిలీ విత్తనాలు వస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

బాల్య వివాహం అడ్డగింత

కారేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొట్లగుడెం పంచాయతీ చింతపాడుతండాలో మైనర్‌బాలికకు తల్లిదండ్రులు వివాహం చేయాడానికి ప్రయత్నాలు చేస్తున్న సమాచారం అందుకున్న ఐసీడీఎస్, పోలీస్,చైల్డ్‌లైన్ సిబ్బంది శనివారం అడ్డుకున్నారు. మరో మూడునెలలు దాటితే బాలికకు 18సంవత్సారాలు నిండుతాయి. అయితే తల్లిదండ్రులు ఈ నెల 21న గ్రామంలో వివాహం చేయడానికి ముహూర్తం ఖారారు చేసి పెళ్ళి వేడుకలకు సిద్ధం అవుతున్న తరుణంలో సమామారం అందుకున్న సంబంధిత అధికారులు గ్రామంలోని బాలిక గృహనికి చేరుకున్నారు. బాల్యవివాహాలు చేయడం వల్ల జరిగే పరిణామాలను తల్లిదండ్రులకు వివరించారు. బాల్యంలో పిల్లలను కనడం వల్ల బిడ్డల పెరుదలపై నష్టం వాటిల్లుతుందన్నారు. మైనార్టీతీరిన తరువాతనే బాలికవివాహం జరిపించాలని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట

▶▶ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

▶▶ ఎస్పీడీసీఎల్ సీఎండీతో కలిసి పరిశీలన



అండర్ గ్రౌండ్ విద్యుత్ ప్రతిపాదనల వివరాలు తెలుసుకుంటున్న భట్టి

మధిరటౌన్, మే 17 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పన దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్, ఆర్థిక ప్రణాళిక శాఖా మాత్యులు మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శనివారం మధిర పట్టణంలో భూగర్భం ద్వారా విద్యుత్ లైన్ల ఏర్పాటు ప్రతిపాదనలను ఎస్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డితో కలిసి పరిశీలించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే 128 కోట్లతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులు చురుకుగా సాగుతున్నాయని అన్నారు. ఎటువంటి ప్రకృతి విపత్తులు సంభవించిన పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు భూగర్భం ద్వారా విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్దమయ్యాయని అన్నారు. ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి భూగర్భం ద్వారా ఏర్పాటు చేయదలిసిన విద్యుత్ లైన్ల మ్యాప్‌ను భట్టికి వివరించారు. మధిర పట్టణంలో ఆత్కూర్ సెంటర్ నుంచి నందిగామ బైపాస్ రోడ్డు వరకు, ఆర్‌వి కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు 40 కోట్ల అంచనాలతో 18 కిలోమీటర్లు 11 కెవి లైన్, మరో 12 కిలోమీటర్ల ఎల్‌టి లైన్లకు సంబందించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, పబ్లిక్ హెల్త ఎస్ఈ రంజిత్ రెడ్డి, మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, విద్యుత్ డీఈలు శ్రీనివాసరావు, హీరాలాల్ ఏడీఈలు అనురాధ, కళ్యాణ చక్రవర్తి సబ్ డివిజన్ ఏఈలు విద్యుత్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

వైరా, మే 17 (ఆంధ్రజ్యోతి): మిత్రా ఫౌండేషన్, ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైరా మండలంలోని రెబ్బవరం ఉన్నత పాఠశాల విద్యార్థిని తిరుమలదాసు మాధురి పదోతరగతిలో జిల్లాస్థాయిలో నాల్గోస్థానం సాధించినందుకుగానూ ప్రతిభా పురస్కారాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేతులమీదుగా శనివారం అందుకుంది. రెబ్బవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో అయిన కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రతిభా పురస్కార కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు దొడ్డా వరప్రసాద్, కిరణ్‌కుమార్, నర్సింహారావు పాల్గొన్నారు.

గీత పారాయణంలో గోల్డ్‌మెడల్



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న రాజ్యలక్ష్మి

వైరా, మే 17 (ఆంధ్రజ్యోతి): వైరాలోని ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ సతీమణి రాజ్యలక్ష్మికి భగవద్గీత పారాయణ పోటీల్లో గోల్డ్‌మెడల్‌ను గణపతి సచ్చిదానంద స్వామిజీ అందజేశారు. శనివారం మైసూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గణపతి సచ్చినందస్వామి నుంచి రాజ్యలక్ష్మి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఇతర కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బోనకల్ తహసీల్దార్‌గా రమాదేవి

బోనకల్, మే 17 (ఆంధ్రజ్యోతి): బోనకల్ తహసీల్దార్‌గా ఎం.రమాదేవిని కేటాయిస్తూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం తహసీల్దార్‌గా పని చేస్తున్న పున్నం చందర్‌ను ఆయన సొంత జిల్లా మహబూబాబాద్‌కు బదిలీ చేశారు. ఉత్తర్వులు అందడంతో ఆయన రిలీవ్ అయ్యారు.

భూ కేటాయింపులో వివాదాలు లేవు



కేటాయింపు భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

బోనకల్, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం రెవిన్యూ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ పాఠశాల భవన నిర్మాణాలకు కేటాయించిన భూములకు సంబంధించి ఎలాంటి వివాదాలు లేవని తహసీల్దార్ ఎ.పున్నం చందర్ తెలిపారు. పాఠశాల నిర్మాణ పనులు చేపట్టే క్రమంలో కొందరు తమ భూములున్నాయని అభ్యంతరాలు తెలిపారని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో శనివారం భూములను మరోసారి పరిశీలించారు. పనులు చేపడుతున్న కంట్రాక్టర్‌తో మాట్లాడారు. సాగుకు అమోదయోగ్యం కాని ప్రభుత్వ భూములను కేటాయించామని ఇందులో ఎలాంటి అభ్యంతరాలకు తావు లేదని తాహసీల్దార్ స్పష్టం చేశారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

వైరా, మే 17 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్, మండల డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పుణ్యాపురం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని చెరుకూరి నివేదతకు రూ.35వేల ఆర్థిక సహాయాన్ని శనివారం డాక్టర్లు డి.కోటయ్య, కాపా మురళీకృష్ణ అందజేశారు. కోల్‌కత్తాలోని దుర్గాపురం ఎన్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ నాల్గో సంవత్సరం చదువుతున్న నివేదతకు ఫీజుల నిమిత్తం ఈ ఆర్థిక సహాయాన్ని ఆమె తండ్రికి అందజేశారు. ప్రభాకర్‌గద్దే నీరజ, పాల్గొన్నారు.

24న మెగా జాబ్ మేళా

వైరా, మే 17 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ నెల 24న వైరా నియోజకవర్గస్థాయిలో నిర్వహించే జాబ్‌మేళా వాల్‌పోస్టర్‌ను శనివారం వైరాలోని వారి స్వగృహంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ సంస్థలను ఆహ్వానించి ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వడ్డే నారాయణ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఖమ్మం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జావెద్, నాయకులు పమ్మి అశోక్, పణితి శ్రీను, కన్నెగంటి నగేష్, పుచ్చకాయల వీరభద్రం, మొక్కా శేఖర్‌గౌడ్, అంజనీ పాల్గొన్నారు.

అర్హులకే సంక్షేమ పథకాలు మంజూరు చేయాలి

▶▶ సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి



సమావేశంలో ప్రసంగిస్తున్న సీపీఎం నాయకుడు సత్యనారాయణరెడ్డి

సత్తుపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇందిరమ్మఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని సత్తుపల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శి శీలం సత్యానారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సిద్దారం గ్రామంలో వేములపాటి కుమారస్వామి అధ్యక్షతన ఆ పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసిన జాబితాల్లో అనర్హులను లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహించి నెలలు కావస్తున్న నూతనంగా ఏ ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు కాలేదన్నారు. ప్రభుత్వం ఇచ్చి హామీల అమలులో విఫలమైందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తప్ప నిజమైన అర్హత కలిగిన వారికి అందటం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి డివిజన్ పార్టీ కమిటీ సభ్యులు కొలికిపోగు సర్వేశ్వరరావు, నాయకులు జాజిరి జ్యోతి, ననందనరావు, ఎం కృష్ణ, రామలు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ



ఎన్.టీ.ఆర్ విగ్రహం కోసం భూమి పూజ చేస్తున్న తాతా సుధాకర్

కొణిజర్ల, మే 17 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారక రామారావు విగ్రహ ఏర్పాటు కోసం శనివారం మండల పరిధిలోని పల్లిపాడు గ్రామంలో వైరా మున్సిపాలిటి పరిధి 17వ వార్డులో మాజీ టీడీపీ మండల అధ్యక్షుడు తాతా సుధాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలనేది పల్లిపాడు గ్రామస్తుల చిరకాలస్వప్నమని ఆయన తెలిపారు. గ్రామస్తులు ఐక్యతతో చురకుగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరారు. తెలుగు ప్రజలకు వన్నె తెచ్చిన ఆజానుబావుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు చెరుకూరి చలపతిరావు, నంద్యాల రవికుమార్, మాజీ కౌన్సిలర్‌లు ధనేకుల వేణు, తడికమళ్ళ నాగేశ్వరరావు, మాదిన్ని రామారావు, వెంకటేశ్వరరావు, దామా శ్రీనువాసరావు, వెంకట్, శ్రీనివాసరావు, హద్దండు, సాయి, నాగభూషణం, కోటి, నరసింహరావు, రవి, శ్రీను, హనుమంతరావు, వెంకటేశ్వర్లు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

వికసించిన మే పుష్పం



కల్లూరు, మే 17 (ఆంధ్రజ్యోతి) కల్లూరు పట్టణంలోని కప్పలబధం రహదారి వైపున గల బీఆర్ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా అధ్యక్షుడు చీలంశెట్టి కిరణ్‌కుమార్ నివాసగృహంలో మే పుష్పం వికసించింది. శనివారం చూపరులకు ఎంతోగాను ఆకట్టుకుంది. ఈ పుష్పం ప్రత్యేకత పుష్పం వికసించిన తరువాత ఎండిపోయి తిరిగి ఏడాది తర్వాత మే నెలలోనే ప్రత్యేకంగా పువ్వ పూస్తుంది.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏడీఏ

చింతకాని, మే 17 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందొచ్చునని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని వందనం, నేరడ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం అందించే పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్టను భూమిలో కలియదున్నటం ద్వారా భూసారం పెంపొందించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏవో మానస, ఏఈవోలు ఆయేషా, రాము, రైతులు పాల్గొన్నారు.

ముత్యాల కవచాలంకరణలో జమలాపురం శ్రీవారు



ఆలయంలో భక్తుల సందడి

ఎర్రుపాలెం, మే 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకరణలో భక్తులకు దర్శనం కలిపించారు.. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కళ్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకళ్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజాది కార్యక్రమాలు నిర్వహించుకుని గిరి ప్రదక్షిణలు చేశారు. శ్రీవారి ఆలయంతో పాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ ,దర్మకర్త ఉప్పల శ్రీరామ చంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు,సోమయ్య, కృష్ణ ప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శాస్త్రి, వెంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కును అందించిన ఎమ్మెల్యే



రాము కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే

తల్లాడ, మే 17 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో పోయినేడాది విద్యుదాఘాతాంతో మృతిచెందిన మాజీ ఎంపీపీ కాంపల్లి రాము కుటుంబానికి రూ.5లక్షల పరిహారం చెక్కును శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అందించారు. ఈ సందర్భంగా రాము చిత్రపటానికి పూలమాలలవేసి నివాళులర్పించారు. అనంతరం మండలంలో మిట్టపల్లి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సత్తుపల్లి డీఈ రాములునాయక్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, ఏఎంసీ మాజీచైర్మన్ దీవెల కృష్ణయ్య, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, మండల కాంగ్రెస్ నాయకులు పోట్టేటి జనార్ధన్‌రెడ్డి, రాయల రాము, తాళ్ల జోసఫ్, గుర్రం శ్రీనివాసరావు, పోట్రు శరత్‌బాబు, గొడుగునూరి లక్ష్మారెడ్డి, మారెళ్ల మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కారేపల్లి, మే 17 (ఆంధ్రజ్యోతి): వైరా నియోజకవర్గంలో సీపీఐ ఎదుగుదలకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జాతీయనాయకుడు బాగం హేమంతరావు అన్నారు. శనివారం మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో వైరా డిబిజన్ నాయకుడు పావినేని సత్యనారాయణ అధ్యక్షతన సమీతీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కార్యకర్తలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వైరా డివిజన్ ఇన్‌చార్జి ఎర్రబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు రావి శివరామకృష్ణ,ఉంగరాల సుధాకర్, పుచ్చాకాయల శ్రీనివాస్‌రావు, భూషయ్యఅనంతరామయ్య, వీరు నాయక్, వడ్డే వెంకటయ్య, బట్టు సంగయ్య, బొమ్మల కృష్ణ, మహిళ నాయకురాలు ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్, రెవెన్యూ అధికారుల మధ్య వాగ్వాదం

▶▶ జవాబుదారీతనం లేని అధికారులేందుకని మండిపాటు

బోనకల్, మే 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం చొప్పకట్లపాలెం మాజీ సర్పంచ్ ఎర్రంశెట్టి సుబ్బారావు, రెవెన్యూ అధికారుల నడుమ తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. దాదాపు గంట పాటు కార్యాలయంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన తన్నీరు నాగేశ్వరరావు, అమరబోయిన లీలావతి, పరిటాల కొండలరావు, అక్కెనపల్లి పుల్లారావులు కుటుంబ సభ్యుల ధృవీకరణ పత్రాల కొరకు 40 రోజుల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. వాటి కోసం బాధితులతో పాటు మాజీ సర్పంచ్ కార్యాలయానికి వచ్చారు. ఈ సమస్య పై గిర్దావర్ నవీన్ కుమార్‌ను అడుగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని మాజీ సర్పంచ్ సుబ్బారావు వాపోయారు. గిర్దావర్ మాత్రం తన దగ్గరకు ధృవీకరణ పత్రాలు రాలేదని చెప్పడంతో వాంగ్మూలాల మీద తాను సంతకం చెశానని రాలేదని ఎందుకు చెబుతున్నారని మాజీ సర్పంచ్ నిలదీశారు. దింతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి తీవ్ర వాగ్వివాదం జరిగింది. తమరు వస్తే వెంటనే పని చేయాలా? తాము వేరే పనుల్లో ఉన్నామని, ఎవ్వరికి చెబుతారో చెప్పుకోమ్మని గిర్దావర్ నవీన్ కుమార్ అన్నట్లు మాజీ సర్పంచ్ కార్యాలయం ఆవరణలోనే ఆర్డీవో నర్సింహారావుకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి బాగోలేదని, గిర్దావర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తాను మాజీ ప్రజా ప్రతినిధిగా వస్తేనే పరిస్థితి ఇలా ఉంటే సామన్యుల సంగతి ఏమిటని ఆర్డీవోకు ఫిర్యాదు చేసినట్లు జరిగిన సంఘటన గురించి ఆయన విలేకర్లకు వెల్లడించారు. అధికారుల తీరు మార్చుకోకపోతే తమ గ్రామ ప్రజలతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.